క్లుప్తంగా

నాగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



చేబ్రోలు: ఖ్యాతిగాంచిన చేబ్రోలులోని గంగా పార్వతి సమేత నాగేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. వైశాఖ బహుళ ఏకాదశి సందర్భంగా స్వామి వారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. రజత నాగాభరణాలంకృతుడైన స్వామి ప్రత్యేక అలంకారంతో భక్తులు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ఆంజనేయస్వామి ఆలయంలో అన్నదానం



గుంటూరు రూరల్: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని గోరంట్ల గ్రామ మెయిన్ రోడ్‌లోని ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు, ఉత్సవాలను నిర్వహించారు. సోమవారం మాజీ సర్పంచ్ యర్రంశెట్టి వేణుగోపాల్ ఆధ్వర్యంలో హోమం , ప్రత్యేక పూజలు, భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి, వేద పండితుల నుంచి ఆశీర్వచనం స్వీకరించారు. ఈ సందర్భంగా తులసి ధర్మచరణ్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక శోభతో నగరమంతా కనుల పండువగా ఉందని, హనుమాన్ జయంతిని ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. సుమారు 4వేల మంది అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. యర్రంశెట్టి సూరి, బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, తోట రంగారావు, గాజుల సాయిరాం, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రాంతీయ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం



గుంటూరు ఎడ్యుకేషన్: ఏసీ కళాశాల వద్ద ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం జువాలజీ అధ్యాపకురాలు మణి విద్యార్థులకు సైన్స్, హిందీ సబ్జెక్టుల గురించి వివరించారు. సైన్స్‌లో నెర్వస్ సిస్టమ్ పార్ట్‌తో పాటు హిందీ సబ్జెక్టులో పుస్తక పఠనం, పిల్లల మానసిక ఉల్లాసం కోసం కథలు చెప్పించారు. తర్వాత మ్యూజికల్ చైర్స్ ఆడించారు. గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో జరిగిన సిబ్బంది పాల్గొన్నారు.

బాణసంచా పేలి ఆటో దగ్ధం



నెహ్రూనగర్: డొంక రోడ్డులో ప్రమాదవశాత్తు సోమవారం రాత్రి దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. హనుమంత్ జయంతి సందర్భంగా ర్యాలీ ఏర్పాటు చేశారు. ఈ సమయంలో బాణాసంచా ఉన్న ఆటోకు ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించడంతో పూర్తిగా దగ్ధమైంది. దీని ప్రభావానికి పక్కనే ఉన్న మరో ఆటో, ద్విచక్ర వాహనాలు పాక్షికంగా దగ్ధమయ్యాయి. నడిరోడ్డుపై పెద్దఎత్తున మంటలు ఎగిసి పడడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ప్రాణ నష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

17వ తేదీలోగా పంట నమోదు చేసుకోవాలి

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని 18 గ్రామాల్లో మొక్కజొన్న పంట వేసిన రైతులు ఈనెల 17వ తేదీలోపు రైతుభరోసా కేంద్రాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి శిరీష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొక్కజొన్న పండించిన రైతులు తమ ఆధార్‌కార్డు, ఆధార్ కార్డుకు లింక్ చేసిన మొబైల్ తీసుకుని వెళ్లి తమ పేర్లను రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాని కోరారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య
- పెదకాకాని స్వర్ణపురికాలనీ, ఎన్టీఆర్ కాలనీలలో గడప గడపకు మన ప్రభుత్వం



స్వర్ణపురికాలనీలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య

పెదకాకాని: రాష్ట్రంలో పేదల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య అన్నారు. పెదకాకాని గ్రామంలోని స్వర్ణపురికాలనీ, ఎన్టీఆర్ కాలనీలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. అధికారులు, స్థానిక నాయకులతో కలసి ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేశారు. ప్రభుత్వ పథకాలతో కుటుంబాలు పొందిన లబ్ధిని వివరించారు. స్థానికుల సమస్యలను తెలుసుకుని సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎన్ని ఇబ్బందులు ఉన్నా సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే ఉన్నారని గుర్తు చేశారు. పార్టీలు, గ్రూపులు, వర్గాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం కాలనీల అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.లక్షలతో రోడ్లు, తాగునీటి సౌకర్యాలు కల్పించిందన్నారు. పింఛన్‌లు, రైతు భరోసా, అమ్మ ఒడి వంటి పథకాల ద్వారా నగదు అందుతున్న తీరును లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు చెప్పిన ప్రతి సమస్యను నోట్ చేసుకుని స్థానిక అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ పాలన, పింఛన్‌ల పంపిణీ వంటి అంశాలపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచి గోళ్ల స్వరూపరాణి, ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జడ్పీటీసీ గోళ్ల జ్యోతి, ఎంపీడీఓ బీవీ మల్లేశ్వరావు, ఎంపీటీసీ సభ్యులు షేక్ షహనాజ్, మాతంగి నిర్మల, మండల కో–ఆప్షన్ సభ్యుడు షేక్ జాకీర్ హుస్సేన్, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ భీమవరపు విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి అంగలకుదురు సాంబశివరావు, స్థానిక నాయకులు గోళ్ల శ్యాంముఖర్జీబాబు, ఆలపాటి రాఘవ, సుంకర కృష్ణారెడ్డి, బందెల ఉదయ్‌శంకర్, చాగంటి మురళీమోహన్‌రెడ్డి, షేక్ నజీర్ అహ్మద్, మండల అధికారులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

యంత్ర పరికరాలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ



గ్రూపు సభ్యులకు వ్యవసాయ యంత్ర పరికరాలను అందజేస్తున్న శివరామకృష్ణ, ఏఓ కిరణ్మయి

కాకుమాను: ప్రభుత్వం రైతులకు అందిస్తున్న వ్యవసాయ యంత్ర పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ అన్నారు. మండల కేంద్రం కాకుమానులోని పలు రైతు గ్రూపు సభ్యులకు సోమవారం వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా పలు వ్యవసాయ యంత్ర పరికరాలను అందజేశారు. ఈసందర్భంగా శివరామకృష్ణ మాట్లాడుతూ మండలంలోని రైతులు గ్రూపులుగా ఏర్పడి ప్రభుత్వం అందిస్తున్న యంత్ర పరికరాలను పొందాలని ఆయన తెలిపారు. యంత్ర పరికరాల కోసం గ్రూపు సభ్యులు పది శాతం చెల్లిస్తే 40 శాతం ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని మిగిలిన 50 శాతం జీడీసీసీ బ్యాంకు రుణం మంజూరు చేస్తుందని ఆయన తెలిపారు. రైతులు యంత్ర పరికరాలను సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలన్నారు. ఈసందర్భంగా గ్రూపు సభ్యులకు రోటోవేటర్, గొర్రులు, తైవాన్ స్ప్రేయర్‌లు పంపిణీ చేశారు ఏఓ కె.కిరణ్మయి, పంగులూరి శ్రీనివాసరావు , ఎంపీఈఓ అంజలి, గ్రూపు సభ్యులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి దృష్ట్యా 'స్పందన' వేళల మార్పు

- నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి
- ఉదయం తొమ్మిది గంటల నుంచే అర్జీల స్వీకరణ



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: వేసవి దృష్ట్యా ప్రజలకు ఇబ్బంది లేకుండా సోమవారం నుంచి స్పందన కార్యక్రమాన్ని ఉదయం 9 గంటల నుంచి నిర్వహిస్తామని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో స్పందన నిర్వహించారు. తొలుత జగనన్నకు చెబుదాం, స్పందన పోర్టల్, ఈఆర్‌పీ, వాట్సాప్, కాల్ సెంటర్ల ద్వారా అందిన ఫిర్యాదులపై అధికారులతో ఆమె సమీక్షించారు. ప్రజల సమస్యల్ని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. వేసవి తీవ్రత దృష్ట్యా వచ్చే వారం నుంచి స్పందన ఉదయం 9 గంటల నుంచి జరుగుతుందని, 8.30 గంటల నుంచే ఫిర్యాదుల రిజిస్ట్రేషన్ ఉంటుందని తెలిపారు. జగనన్నకు చెబుదాంకు అందే ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా రాష్ట్ర స్థాయి అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నారని, వాటిని బాధ్యతతో పరిష్కరించాలని చెప్పారు. ఫిర్యాదులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్స్‌ను ఆయా విభాగాధిపతులు పరిశీలించాలని, విభాగాల వారీగా జగనన్నకు చెబుదాం ఆర్జీలకు ప్రత్యేక సిబ్బందిని కేటాయించుకోవాలని ఆదేశించారు. సమస్య పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియజేయాలని చెప్పారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 34 ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఇందులో పట్టణ ప్రణాళిక విభాగానికి 13, ఇంజినీరింగ్ విభాగానికి 9, రెవెన్యూ విభాగానికి 4, ప్రజారోగ్య విభాగానికి 3, ఉపా సెల్ విభాగానికి 1, అకౌంట్స్ విభాగానికి 4 చొప్పున అందాయని వివరించారు. ఫిర్యాదుల్ని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారుల్ని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.రోజా, డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకటకృష్ణయ్య, ఎస్ఈ భాస్కర్, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంహెచ్ఓ డాక్టర్ భానుప్రకాష్, ఏడీహెచ్ రామారావు, బయాలజిస్ట్ మధుసూదన్, మేనేజర్ శివన్నారాయణ, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, డెప్యూటీ సిటీ ప్లానర్లు, ఏసీపీలు, ఈఈ లు, ఎస్ఎస్‌లు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటాం

నగరపాలక సంస్థ కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటామని, కార్మికులకు పరిహారాల్ని వెంటనే అందించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. ప్రజారోగ్య విభాగంలో అవుట్ సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహించే టి.మరియమ్మ ఇటీవల మరణించారు. ఆమె కుమార్తెకు రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును కమిషనర్ అందించారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



మొక్కజొన్న కొనుగోలును ప్రారంభిస్తున్న సొసైటీ అధ్యక్షుడు సాంబశివరావు

వేజండ్ల(చేబ్రోలు): మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ద్వారా రైతులు పండించిన మొక్కజొన్నను ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయించుకోవాలని వేజండ్ల సొసైటీ అధ్యక్షుడు చందు సాంబశివరావు తెలిపారు. చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామంలో సోమవారం ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రంను ప్రారంభించారు. క్వింటా మొక్కజొన్నను రూ.1962లకు కొనుగోలు చేస్తున్నట్లు సొసైటీ అధ్యక్షుడు సాంబశివరావు తెలిపారు. మండలం పరిధిలోని అన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ప్రారంభ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు జీబీసీఎంఎస్ డైరక్టర్ కుర్రా పాములు, కె.కిరణ్ కుమార్, ఈశ్వరరెడ్డి, ఎంపీటీసీ ఎస్.వెంకటరెడ్డి, ముత్యమేశ్వరరావు, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ముగిసిన హనుమాన్ జయంతి ఉత్సవాలు



ఆంజనేయస్వామి దేవస్థానంలో పూర్ణాహుతి

నగరంపాలెం: కొత్తపేట నాజ్ కూడలిలోని శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఉదయం భక్తిశ్రద్ధలతో పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులు, పేదలకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ సహాయ కమిషనర్, ఈఓ డి.శ్రీనివాసరావు, దేవస్థానం చైర్మన్ పి.జయప్రకాష్‌రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు విశాలాక్షి, వెంకటజ్యోతి, నరేష్‌కుమార్, రామకోటేశ్వరరావు, వెంకటరత్నం, శ్రీనివాసులు, అనిత, శివకుమారి, అర్చకులు నరసింహాచార్యులు, మురళి పాల్గొన్నారు.

ఇడుపులపాయ నుంచి తాడేపల్లికి పాదయాత్ర



పాదయాత్రను ప్రారంభిస్తున్న కార్పొరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్, గనిక ఝాన్సీ

గుంటూరు రూరల్: తన కుమార్తె ప్రాణాలను ఆరోగ్య శ్రీద్వారా కాపాడిన దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి కృతజ్ఞతగా, ఆయన విగ్రహ ప్రతిష్టను చేపట్టేందుకు అభిమాని ఇడుపులపాయనుంచి తాడేపల్లి ముఖ్యమంత్రి కార్యాలయం వరకు పాదయాత్ర చేపట్టటం అభినందనీయమని విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్ తెలిపారు. సోమవారం వెంగళాయపాలెం గ్రామంలో దేవరకొండ నాగేశ్వరరావు చేపట్టనున్న ఇడుపులపాయ నుంచి తాడేపల్లి వరకు పాదయాత్ర కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ నాగేశ్వరరావు కుమార్తెకు ఆరునెలల వయస్సులో గుండెకు సంబంధించిన వ్యాధి రావటంతో ప్రైవేటు ఆసుపత్రుల్లో రూ.లక్షలు ఖర్చు అయ్యే ఆపరేషన్‌ను ఆనాటి ముఖ్యమంత్రి, దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చేయించి ఆమె ప్రాణాలను కాపాడాడన్నారు. అందుకు కృతజ్ఞతగా మహానేత విగ్రహాన్ని నాగేశ్వరరావు ఇంటివద్ద రోడ్డుపై ఏర్పాటు చేశాడన్నారు. ఈ విగ్రహ ఆవిష్కరణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆహ్వానించేందుకు ఈ పాదయాత్రను చేపట్టడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా విగ్రహావిష్కరణ చేపట్టాలని అభిమాని నాగేశ్వరరావు కోరిక అని తెలిపారు. ఈ మేరకు గ్రామంలోని పార్టీ నాయకులతో కలిసి ఇడుపుల పాయకు బయలుదేరారన్నారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ గనిక ఝాన్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జోసఫ్, పార్టీ నాయకులు శంకర్, ఆసీఫ్, బాషా, మైనార్టీ నాయకులు మాలిక్, అందుగుల జోసెఫ్, తదితరులున్నారు.

స.హ. చట్టంపై అవగాహన అవసరం

తాడేపల్లిరూరల్: సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక కోర్ కమిటీ సభ్యులు ఎర్రంశెట్టి జగన్‌మోహన్‌రావు అన్నారు. ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లి సెంటర్ వంశీ టాలెంట్ స్కూల్ ఆవరణలో అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోర్ కమిటీ సభ్యులు ప్రజలకు సమాచార హక్కు చట్టం ప్రజాస్వామ్యంలో ప్రజల ప్రయోజనాలను ఏ విధంగా కాపాడుతుంది, ప్రజాస్వామ్యంలో ప్రజల యజమానితత్వాన్ని ఏ విధంగా బలపరుస్తుంది అనే విషయాలను వివరించారు. తమ గ్రామాల్లో ఎవరైనా అవగాహనా సదస్సులను ఏర్పాటు చేయాలనుకుంటే 9948074365 లో సంప్రదించవచ్చని కోరారు. కార్యక్రమంలో ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి శీలం నాగార్జున, వేదిక రాష్ట్ర ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి కొతవరపు ప్రసాద్, కోర్ కమిటీ సభ్యులు కోటా ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి శిర్ల లాల్‌చంద్ పాల్గొన్నారు.

కుల, మత, పార్టీలకతీతంగా నగరాభివృద్ధి



సమావేశంలో పాల్గొన్న మేయర్, సభ్యులు

నెహ్రూనగర్: కుల, మత, పార్టీలకతీతంగా నగరాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు స్టాండింగ్ కమిటీ అధ్యక్షుడు, మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు తెలిపారు. ఆయన చాంబర్‌లో సోమవారం స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. పలు అభివృద్ధి పనుల్ని చేపట్టడానికి ఆమోదం తెలిపారు. రూ.24.48 కోట్లతో 77 అంశాలకు సంబంధించి, రెండో అంశంలో చిన్న మార్పులతో స్టాండింగ్ కమిటీ సభ్యులు, నగరపాలక సంస్థ వివిధ విభాగాధిపతులతో విపులంగా చర్చించి ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారుల పరిశీలనలో గుర్తించిన ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా డివిజన్ల వారీగా ప్రాధాన్యత క్రమంలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణాలకు ఆమోదం తెలిపామని చెప్పారు. రోడ్ల విస్తరణ జరుగుతున్న ప్రాంతాలు, విలీన గ్రామాల్లో నూతనంగా సీసీ డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణానికి ప్రత్యేక ఆమోదం తెలిపామని పేర్కొన్నారు. వివిధ కాంప్లెక్స్‌ల్లో షాప్‌ల లీజు పీరియడ్ పూర్తయిన వాటిని నిబంధనల ప్రకారం రెన్యువల్ చేసినట్లు చెప్పారు. శ్మశానవాటికల అభివృద్ధికి ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నామని, వివిధ వసతులు కల్పనకు ఆమోదం తెలిపామని వెల్లడించారు. బీఆర్ స్టేడియం పరిధిలోని పైప్‌లైన్ మరమ్మతులు, నూతనంగా నిర్మించిన వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలకు ప్రహరీల నిర్మాణానికి ఆమోదం తెలిపామని వెల్లడించారు. సమావేశంలో స్థాయి సంఘ సభ్యులు నిమ్మల వెంకటరమణ, పడాల సుబ్బారెడ్డి, బొడ్డుపల్లి స్మిత పద్మజ, షేక్ జుమ్మా బి, మల్లవరపు రమ్య, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పెద్ది రోజా, డెప్యూటీ కమిషనర్లు బి. శ్రీనివాసరావు, టి. వెంకట కృష్ణయ్య, శ్రీనివాసరావు, యస్ఈ భాస్కర్, సీపీ ప్రదీప్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పంట వ్యర్థాలను తగలబెట్టరాదు



రైతులకు అవగాహన కల్పిస్తున్న డీడీఏ రామాంజనేయులు

కొల్లిపర: జొన్న, మొక్కజొన్న పంటలు కోతలు అయిన తరువాత వాటిని తగలబెట్టకుండా మల్చర్ యంత్ర పరికరంతో చిన్న చిన్న ముక్కలుగా చేసి, బయో డీకంపోసర్స్ ద్వారా కుళ్లింప చేసి సేంద్రియ పదార్థాలుగా మార్చవచ్చని డీడీఏ పి. రామాంజనేయులు తెలిపారు. మండల పరిధిలోని దావులూరులో సోమవారం గుంటూరు జిల్లా వనరుల కేంద్రం, అఖిల భారత వ్యవసాయ పరికరాల సమన్వయ కేంద్రం బాపట్ల ఆధ్వర్యంలో రైతులకు మల్చర్, బయో డీకంపోసర్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీడీఏ మాట్లాడుతూ జొన్న, మొక్కజొన్న పంటలు కోతలు అనంతరం రైతులు వాటి ఆకులు, కాండాల్ని తగలబెట్టడం వల్ల భూమిలోని అనేక ఉపయోగకర జీవరాశులు చనిపోతాయన్నారు. సేంద్రియ పదార్థాలు తగ్గిపోయి తద్వారా భూమి సహజ గుణం కోల్పోయి నిస్సారంగా తయారవ్వడమే కాకుండా పర్యావరణం కూడా దెబ్బతింటుందని తెలిపారు. పంటల అవశేషాల్ని తగలబెట్టకుండా మల్చర్ పద్ధతి ద్వారా భూముల్ని దున్నాలని సూచించారు.

విశ్రాంత ఉపాధ్యాయిని ఇంట్లో దోపిడీ

గుంటూరు ఈస్ట్: విశ్రాంత ఉపాధ్యాయిని ఇంట్లో దోపిడీపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. గర్నెపూడి సుగుణ ప్రసూనాంబ ఉపాధ్యాయురాలిగా రిటైర్ అయ్యారు. శ్రీనగర్ 2వ లైనులో కృష్ణ తులసి హోమ్స్‌లో ఒంటరిగా నివాసం ఉంటున్నారు. ఆదివారం రాత్రి ఇద్దరు మహిళలు ప్రసూనాంబ ఫ్లాట్ తలుపు కొట్టారు. ఆమె తీయగానే లోపలకు జొరబడి, తలుపులు వేశారు. ప్రసూనాంబ చేతులు, కాళ్లు కట్టేసి రూ. 1.20 లక్షల విలువ చేసే గాజులు, బంగారం గొలుసు దోచుకుని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సివిల్ సర్వీస్ పరీక్షలో రాజ్యాంగం ముఖ్యమైన అంశం

గుంటూరు ఎడ్యుకేషన్: సివిల్ సర్వీసెస్, గ్రూప్–1, గ్రూప్–2 వంటి పోటీ పరీక్షల్లో భారత రాజ్యాంగ ముఖ్య లక్షణాలు సిలబస్‌లో భాగంగా ఉంటాయని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు చెప్పారు. స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్, కె.వి.ఆర్.ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఐఏఎస్ ఫౌండేషన్ క్లాసుల్లో భారత రాజ్యాంగం గురించి సోమవారం వివరించారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ నాయకత్వంలో రాజ్యాంగం రూపొందడం, ప్రాథమిక అంశాల గురించి ఎమ్మెల్సీ వివరించారు. రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు, ప్రాథమిక విధులు ఉంటాయని తెలిపారు. న్యాయవ్యవస్థ, పౌరుల ప్రాథమిక హక్కులు కాపాడుతుందని చెప్పారు. భారత రాజ్యాంగం ప్రపంచంలో ఉన్నతంగా కొనసాగుతోందని తెలిపారు. సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షల్లో కూడా రాజ్యాంగంపై ప్రశ్నలు ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో సాయి, బాలు, అజయ్, సుబ్బారాయుడు పాల్గొన్నారు.

రేపటి నుంచి 'లయన్స్' సమ్మర్ క్యాంప్

చేబ్రోలు: పొన్నూరులోని లయన్స్ పాలీసర్వీస్ అండ్ వెల్ఫేర్ సెంటర్‌లో మే 16వ తేదీ నుంచి 25వ తేదీ వరకు 10 రోజులపాటు సమ్మర్ క్యాంప్ జరుగుతుందని ప్రముఖ అబ్జర్వేషనల్ సైకాలజిస్ట్ పిన్నిబోయిన శ్రీమన్నారాయణ సోమవారం తెలిపారు. స్టూడెంట్స్ ఇంటలెక్చువల్ ఫోరం వారి ఆధ్వర్యంలో లయన్స్ పాలి సర్వీస్ – వెల్ఫేర్ సెంటర్ వారి సహకారంతో 'ఈ తరంలో మేము ప్రత్యేకం' టైటిల్‌తో విద్యార్థులకు డ్యాన్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై శిక్షణ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఫోక్, వెస్టన్, భాంగ్రా డాన్సులలో శిక్షణ, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా నేటి విద్యార్థులకు జంక్ ఫుడ్ తినడాన్ని మాన్పించడం (హెల్త్ ట్రెనింగ్), సెల్ ఫోన్ వీడియో గేమ్‌లకు బానిసలుగా మారిన విద్యార్థులకు ప్రత్యేకమైన కౌన్సెలింగ్ ఇవ్వడం ద్వారా వారిలో మార్పు తీసుకురావడం వంటి అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. దీనిని పొన్నూరు పరిసర ప్రాంతాల వారు సద్వినియోగం చేసుకోవాలని శ్రీమన్నారాయణ తెలిపారు.

అందరికీ 'ఉపాధి' కల్పించాలి

బోడిపాలెం(కాకుమాను): గ్రామంలో జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని సర్పంచ్ నలిగల ఉషారాణి సూచించారు. మండలంలోని బోడిపాలెం, కొల్లిమర్ల, పెద్దివారిపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద సోమవారం 2023వ సంవత్సరానికి సంబంధించిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై గ్రామ సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఉషారాణి మాట్లాడుతూ గ్రామంలో జాబ్ కార్డులు ఉన్న ప్రతి ఒక్కరిని గుర్తించి వారందరికీ వంద రోజుల పని దినాలు కల్పించే విధంగా సిబ్బంది కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎస్ఆర్పీ రామారావు, ఏపీఓ సింగారావు, కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ప్రజా వేదిక..

మండల కేంద్రం కాకుమాను రైతు భరోసాకేంద్రం-2 వద్ద మంగళవారం ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏపీఓ సింగారావు తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ యుగంధర్ పాల్గొంటారని మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు, సిబ్బంది హాజరు కావాలని ఆయన కోరారు.

విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

పెదనందిపాడు: విద్యార్థుల భవిష్యత్తుకు గ్రంథాలయాలు దోహదపడతాయని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గేరా మోహనరావు అన్నారు. పెదనందిపాడులోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకురాలు పి.సుభాషిణి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మోహనరావు మాట్లాడుతూ కథలు, కథనాలు, సృజనాత్మక కృత్యాలు నిర్వహించడం వలన విద్యార్థులలో నైతిక విలువలు పెరుగుతాయన్నారు. పుస్తక పఠనం వలన ప్రపంచ జ్ఞానం కలుగుతుందని తెలిపారు. సుభాషిని మాట్లాడుతూ మే 8 నుంచి జూన్ 11 వరకు 40 రోజులపాటు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మంజుల, రామస్వామి, విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

సాంఘిక నాటక కళాకారుడు రమణారావుకు సన్మానం

తెనాలి అర్బన్: నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో సోమవారం రాముడు–భీముడు చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. మంగళవారం దాగుడుమూతలు చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం పౌరాణిక, సాంఘిక నాటక కళాకారుడు, రేడియో, టీవీ ఆర్టిస్ట్ గుత్తా వెంకట రమణారావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఫణిదపు దుర్గా, నరసింహారావు, అనిశెట్టి సత్యనారాయణ, చింతలపూడి శ్రీనివాసరావు, సోమవర పు సాంబశివరావు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, దేవిశెట్టి భాస్కర్, గుమ్మడి ప్రసాద్, ముళ్లపూడి వెంకట్, నల్లూరి శ్రీనివాస్, నరసయ్య, హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

చిన్నారులను క్రీడల వైపు ప్రోత్సహించాలి

గుంటూరు వెస్ట్ (క్రీడలు): చిన్నారుల్ని క్రీడల వైపు ప్రోత్సహించే బాధ్యత తల్లిదండ్రులదేనని పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ విభాగ ఎస్పీ టి.శివారెడ్డి తెలిపారు. ఐటా చాంపియన్‌షిప్ సీరీస్‌లో భాగంగా ది సిటీ టెన్నిస్ చాంపియన్‌షిప్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆఫీసర్స్ క్లబ్‌లో నిర్వహించిన అండర్–16 బాలబాలికల టెన్నిస్ పోటీల్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల్ని కూడా ప్రొఫెషన్‌గా ఎంచుకుని దేశానికి పేరు తెచ్చిన వాళ్లు ఎందరో ఉన్నారని చెప్పారు. క్రీడల నిర్వహణ కార్యదర్శి జి.జగదీష్ చంద్రబాబు మాట్లాడుతూ పోటీల్ని 19వ తేదీ వరకు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీఐ కమిషనర్ శామ్యూల్, ఆఫీసర్స్ క్లబ్ కార్యదర్శి సీహెచ్. విల్సన్ బాబు పాల్గొన్నారు.